క్లుప్తంగా

ప్రజలకు పుష్కలంగా తాగునీరు

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం, ఇందిరానగర్‌లో తాగునీటి సమస్యలు తీరాయని మండల విస్తరణాధికారి సత్యనారాయణ తెలిపారు. చాలా రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్య తీరిందన్నారు. జెడ్పీ నుంచి రూ.5లక్షల నిధుల నుంచి కొత్త బోరు వేసి మోటారు అమర్చి నీరు వదిలామని తెలిపారు. బోరు మోటారు అమర్చి జెడ్పీటీసీ అన్బలగన్ చేతులమీదుగా ప్రారంభించారు. నీరు పుష్కలంగా రావడంతో మహిళలు సంతోషించారు. కార్యక్రమంలో షణ్ముగరెడ్డి, రవిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

జీడీ నెల్లూరు పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థి తులసిరాం పాఠశాలకు రూ.50 వేల విలువైన ఫ్యాన్లను వితరణ చేశారు. శనివారం ఉదయం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బరామయ్యకు అందజేశారు. పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యార్థం తరగతి గదులలో ఫ్యాన్లను ఉపయోగించాలని కోరారు. తమ బ్యాచ్‌లోని పూర్వ విద్యార్థులు సైతం త్వరలో పాఠశాల అభివృద్ధికి ప్రణాళికతో మరిన్ని కార్యక్రమాలకు చేయూతనందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ హరిబాబు, పూర్వ విద్యార్థులు రవి, ధనరాజ్, ప్రకాష్, శ్రీరాములురెడ్డి, మునస్వామి, కుమార్ పాల్గొన్నారు.

మృతురాలికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: మండల వైఎస్ఆర్ సీపీ నాయకుడు వెంకటేష్ తల్లి చిన్న పాపమ్మ (55)శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి శనివారం గంగాధరనెల్లూరు పంచాయతీ కట్టకింద పల్లి గ్రామానికి చేరుకున్నారు. చిన్న పాపమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, స్థానిక సర్పంచ్ వీసీ సుబ్రహ్మణ్యం యాదవ్, నాయకులు ముని రాజారెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చిన్నమరెడ్డి, ఆంబోదరపల్లి బాబురెడ్డి, నియోజకవర్గ ఆర్టీఐ అధ్యక్షుడు ఢిల్లీ కుమార్, నాయకులు మోహన్, మోసెస్, వినోద్, గౌతమ్, విష్ణు పాల్గొన్నారు.

నిమజ్జనం వేళ అప్రమత్తంగా ఉండాలి



ఎస్ఐ చిన్నరెడ్డప్ప

పాలసముద్రం: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు చివరి దశకు చేరుకున్నాయని ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలు మూడు రోజుల్లోనే 80 శాతం విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం మూడోరోజు కావడంతో మండలంలో ఒకటి, రెండు విగ్రహాలు మాత్రం నిమజ్జనం చేశారని తెలిపారు. ఐదో రోజు ఆదివారం నిమజ్జనం చేస్తున్నారని, వినాయక నిమజ్జనంలో ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మద్యం మత్తులో వేడుకల్లో పాల్గొనరాదని, నిమజ్జనం సమయంలో చిన్న పిల్లలను ఊర్లోనే వదిలేయాలని తెలిపారు. నిమజ్జనం సమయంలో చెరువులు, వంకల్లో విగ్రహం వేసిన తరువాత ఒకరిపై ఒకరు దూకకూడదని హెచ్చరించారు.

ఉత్తమ బోధనకు టీచర్స్ హ్యాండ్‌బుక్

నగరి: పిల్లలకు అర్థమయ్యేలా బోధించడానికే టీచర్ హ్యాండ్ బుక్(ఉపాధ్యాయుల కరదీపిక) పద్ధతిని పాటిస్తున్నట్లు ఎంఈఓ శ్రీదేవి అన్నారు. శనివారం ఎం.కొత్తూరులో నిర్వహించిన క్లస్టర్ స్కూల్ టీచర్ల సమావేశంలో ఆమె పాల్గొని, ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ఇప్పటివరకు పాఠ్య ప్రణాళిక తయారు చేసుకుని దాని ఆధారంగా బోధించేవారమని ప్రస్తుతం ఎస్‌సీఈఆర్‌టీ సహకారంతో సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా 'సామర్థ్య ఆధారిత బోధన – అభ్యసన ఉపాధ్యాయ వనరు' పేరుతో సబ్జెక్టుల వారీగా కరదీపికలను తయారుచేసి అందిస్తున్నారన్నారు. హ్యాండ్ బుక్ వినియోగంపై అవగాహన కల్పించారు.

నగలు, నగదు చోరీ

శ్రీరంగరాజపురం: ఓ ఇంట్లోకి చొరబడి బంగారు నగలు, నగదు దోచుకెళ్లిన సంఘటన మండలంలోని ఒడ్డుపల్లిలో జరిగింది. బాధితుడు భాస్కర్‌నాయుడు కథనం మేరకు.. ఒడ్డుపల్లికి చెందిన భాస్కర్ నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం చిత్తూరులోని తమ బంధువుల పెళ్లికి వెళ్లారు. రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపు పగలగొట్టి బీరువాలో ఉంచిన 48 గ్రాముల బంగారు నగలు, రూ.50 వేల నగదు అపహరించారు. బాధితుడు భాస్కర్‌నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనవసర మందులు.. అనర్థదాయకం

- అవసరమైన మేరకే పైర్లకు పురుగు మందులు వాడాలి
- పొలాల్లో పిచికారీ సమయంలో జాగ్రత్తలు పాటించాలి
- వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు అనుసరించాలి



మందుల పిచికారీ

విజయపురం: రైతులు సాగు చేసిన పంటలకు వివిధ రకాల చీడపీడలు, తెగుళ్లను ఆశించే పురుగులను నాశనం చేయడానికి వివిధ రకాల పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. సీజన్ ప్రారంభం నుంచి చివరి వరకు అవగాహన లేకుండా, ఇష్టానుసారంగా మందులు వాడుతుంటారు. ఇలా చేయడంతో నష్టమే ఎక్కువని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అలాగే మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు నిర్లక్ష్యంగా చేయరాదని హెచ్చరిస్తున్నారు. ఎప్పుడూ వాడే మందులే కదా అని నిర్లక్ష్యంగా పిచికారీ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దంటూ హెచ్చరిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అన్నదాతలు రక్షణ పొందడంతోపాటు లాభాలు చూడవచ్చునని తెలిపారు.

అవసరమైతేనే వాడాలి

పైరుపై సీజన్ బట్టి ఏదో ఒక పురుగులు సోకుతుంటాయి. ఒకటి రెండు పురుగులు కనిపించగానే రైతన్నలు పైరుపై వివిధ రకాల పురుగు మందులు వాడేస్తున్నారు. ఇలా చేయడంతో పైరుకు మేలు చేసే మిత్ర పురుగులు సైతం చనిపోతున్నాయి. పైరులో అధికంగా పురుగులు ఉన్నప్పుడు మాత్రమే నివారించేందుకు మందులను వినియోగించాలి.

మందుల ఎంపికలో జాగ్రత్తలు

సీజన్‌ను బట్టి రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. వీటిని దృష్టిలో పెట్టుకొని పంటలపై పురుగులను నివారించేందుకు వివిధ కంపెనీలు ప్రచారం చేస్తుంటాయి. అయితే ఏ మందు పడితే ఆ మందును పైరుపై పిచికారీ చేస్తే ఫలితం ఉండదు. ఇప్పటిక వరకు దుకాణదారులు, ఏ మందు ఇస్తే అదే వాడడం రైతులకు పరిపాటిగా మారింది. అయితే ఇలాంటి చర్యలు రైతుకు నష్టాలనే కలిగిస్తాయని అధికారులు సూచిస్తున్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

గుర్తింపు పొందిన కంపెనీల పురుగు మందులనే వాడాలి. మందు డబ్బాల మూతలను నోటితో తీయకూడదు. మందు ద్రావణాన్ని డ్రమ్ములో కానీ, బకెట్లో కానీ కలిపిన తర్వాతనే స్ప్రేయర్లలో నింపుకోవాలి. ముందులను నీటిలో కలిపేటప్పుడు చేతులకు గ్లాజులతో పాటు రక్షణ దుస్తులు ధరించాలి. ఆరోగ్యం సరిగా లేని వారు మందులు పిచికారీ చేయరాదు. కళ్లలో పడకుండా రైతులు కళ్లజోడు ధరించడం ఉత్తమం. అనుకోకుండా పురుగుమందు తుంపర్లు కంటిలో పడితే వెంటనే కళ్లను చల్లటి నీళ్లతో బాగా కడిగి వైద్యుడిని సంప్రదించాలి. శరీరంపై గాయాలు ఉన్నవారు మందులను పిచికారీ చేయరాదు. గాలికి వాలుగా పిచికారీ చేయడం ఎంతో ఉత్తమం. పిచికారీ అనంతరం రైతులను రెండు మూడు సార్లు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. పశువుల మేత కోసం పెంచిన పైర్లలో మందుల వినియోగించకూడదు. కల్తీ మందులు వాడకూడదు.

మోతాదు మేరకే వాడాలి

వ్యవసాయాధికారుల సూచనలు మేరకే తెగుళ్ల, పురుగుల నివారణకు మందులను వాడాలి. తక్కువ మందు వాడితే అది పనిచేయక పురుగులు చావవు. ఎక్కువ మందులు వాడితే పంటకు నష్టం కలిగించడంతోపాటు అధిక వ్యయంతోపాటు రైతులకు పెట్టుబడి పెరుగుతుంది. పురుగులకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి, తెగుళ్ల వ్యాప్తి అధికమవుతుంది. పైరుపై ఎక్కువ సార్లు మందులను పిచికారీ చేయడం మంచిదికాదు.

రేపు పులిగుండు వద్ద ఉచిత వైద్య శిబిరం

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని ప్రసిద్ధి చెందిన పులిగుంటీశ్వరస్వామి దేవాలయం వద్ద సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. పులిగుంటీశ్వరస్వామి ఆలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహాసముద్రం ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా ఈ వైద్య శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తారని, రోగులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా చిరంజీవి



చిరంజీవి

పుత్తూరు: తెలుగు యాదవ మహాసభ నగరి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎస్.చిరంజీవిని రాష్ట్ర అధ్యక్షుడు గురవయ్య నియమించారు. చిరంజీవి మాట్లాడుతూ పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. పదవికి న్యాయం చేస్తానని తెలిపారు.



మాజీ ఉప ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

గంగ జాతరకు ఆహ్వానం

పుత్తూరు: పుత్తూరులో వచ్చే నెల 3వ తేదీన నిర్వహించనున్న గ్రామ దేవత పిడికిలి గంగమ్మ జాతరలో పాల్గొనాలని జాతర కమిటీ సభ్యులు శనివారం మాజీ ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామిని ఆహ్వానించారు. స్థానికంగా ఉన్న ఆయన నివాసానికి వెళ్లి సంప్రదాయబద్ధంగా ఫలపుష్పాలతో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీన చాటింపు, వచ్చే నెల 1, 2 తేదీల్లో గెరిగ ఊరేగింపు, 3వ తేదీన జాతర ఉంటుందని తెలియజేశారు.

గణపతికి ప్రత్యేక పూజలు



గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం గణపతి విగ్రహాన్ని ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీకావేరిరాజుపురంలో గణపతికి కుడుములు, పెట్టి పూలమాల వేసి పూజలు చేపట్టారు. శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేశులు తన సొంత ఖర్చులతో రూ.20 వేలు విలువజేసే చీరలను మహిళలకు పంపిణీ చేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల కోసం పడిగాపులు





స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, కార్డుల పంపిణీ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు

పాలసముద్రం: ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయాలని తహశీల్దార్ అరుణకుమారి శనివారం ఆదేశించారు. శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఆమె ప్రారంభించారు. అయితే రేషన్ షాపులు, గ్రామ సచివాలయం వద్ద స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తామని లబ్ధిదారులకు చెప్పడంతో రేషన్ కార్డుల లబ్ధిదారులు సచివాలయాలకు పరుగులు తీశారు. ఇంట్లో పనులు మానుకొని గంటల తరబడి మహిళలు, వృద్ధులు సచివాలయం వద్ద అవస్థలు పడ్డామన్నారు. చివరికి సర్వర్ బిజీ, ఓటీపీ రావడం లేదని చెప్పడంతో ఇంటికి వచ్చామన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని రేషన్ కార్డుదారులందరికీ స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ బాబు అన్నారు. శనివారం మండలంలోని దేవరగుడిపల్లెలో రైస్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రేషన్ దుకాణాల వద్ద అందరికీ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆశీర్వాదం, మాజీ ఎంపీటీసీ మోహన్‌మురళీ, సింగిల్‌విండో చైర్మన్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వినాయక మండపం వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న యువత

పుత్తూరు: స్థానిక మంచినీళ్ల గుంట వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకస్వామి మండపం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితి నవరాత్రి వేడుకల్లో భాగంగా ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు మంచినీళ్ల గుంట యువత ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మణిశంకర్ సేవలు అభినందనీయం



మణిశంకర్‌ను సత్కరిస్తున్న మంజునాథ్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి

పుత్తూరు: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన మున్సిపల్ మేనేజర్ మణిశంకర్ సేవలు అభినందనీయమని కమిషనర్ ఎం.మంజునాథ్‌గౌడ్ కొనియాడారు. శనివారం మణిశంకర్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన్ను మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ మణిశంకర్ నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచారన్నారు. ఆయన చూపిన బాటలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది నడవాలని సూచించారు. ఉద్యోగ విరమణ చేసినా ప్రజలకు ఆయన సేవలు నిరంతరం అందించాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ ఏఈ కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

కార్వేటినగరం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన ఈడిగపల్లి సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ గోవిందస్వామి కథనం మేరకు.. తమిళనాడులోని సూరాజపేట గ్రామానికి చెందిన నాగవేలు, మౌనిక దంపతులు ఇద్దరు ద్విచక్రవాహనంలో కార్వేటినగరం మండలం కృష్ణాపురం గ్రామానికి వెళ్లి, తిరుగు ప్రయాణం అయ్యారు. ఈడిగపల్లి సమీపంలోని మలుపులో గుర్తు తెలియని వాహనం వారి మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో నాగవేలు, మౌనిక గాయపడ్డారు. భార్యాభర్తలను చికిత్స నిమిత్తం తమిళనాడులోని కోనేటం పేట వద్ద ఉన్న ఆస్పత్రికి తరలించారు. అనంతరం పుత్తూరుకు తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

దళిత నాయకుడనే నిలబెట్టారు





అధికారులను నిలదీస్తున్న బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ భాస్కర్, మాట్లాడుతున్న ఎంపీపీ నాగరాణి

- మండల సమావేశంలో బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ భాస్కర్ ఆవేదన

వెదురుకుప్పం: ఎంపీటీసీగా ప్రజల చేత ఎన్నికైన దళిత నాయకుడనే గౌరవం లేకుండా రెండు గంటల సేపు వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నిలబెట్టారని బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ సభ్యుడు కొత్తపల్లె భాస్కర్ అధికారులను నిలదీశాడు. శనివారం వెదురుకుప్పంలో ఎంపీపీ నాగరాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ భాస్కర్ పోలీస్‌స్టేషన్‌లో తనకు జరిగిన అన్యాయాన్ని సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. అన్ని సెక్షన్ల కింద కేసులు బనాయించి మూల కూర్చోపెడతామంటూ బెదిరించినట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని, లేకుంటే సమావేశం నుంచి వెళ్లిపొమ్మంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐ మాట్లాడుతుండగా ఎంపీపీ నాగరాణి కలుగజేసుకుని భాస్కర్‌పై ఎవరు కేసు పెట్టారని ప్రశ్నించారు. ముద్దాయి అని ఎలా అంటారని అడిగారు. తనకు న్యాయం జరగకపోతే కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేశాడు. భూమికి సంబంధించి ఎలాంటి రికార్డులు అతని వద్ద లేవని ఎస్ఐ బదులిచ్చారు. వెదురుకుప్పం ఎంపీటీసీ రాధిక మాట్లాడుతూ పచ్చికాపల్లం పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ప్రజలకు నాణ్యమైన వైద్యం కరువైందన్నారు. ప్రశ్నించారు. నల్లవెంగనపల్లె సర్పంచ్ పుష్ప మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో అవకతవకలపై ఎంఈఓ దామోదరంను ప్రశ్నించారు. తిరుమలయ్యపల్లె ఎంపీటీసీ హరి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు అర్హులకు మంజూరు చేయలేదని ఆరోపించారు. ఎంపీపీ నాగరాణి మాట్లాడుతూ సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ పురుషోత్తం, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, సింగిల్‌విండో చైర్మన్ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ, రమణ సుబ్రమణ్యం, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, ఎంపీటీసీలు మునిచంద్రారెడ్డి, చిన్నబ్బ, గుణశేఖర్, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫండ్‌ను ఫలహారంగా పంచొద్దు

- ప్రయోజనకరంగా మార్చండి
- వార్డులో పనులపై కౌన్సిలర్లను సంప్రదించాలి
- ధ్వజమెత్తిన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

నగరి: బీపీఎస్ 2019, ఎల్ఆర్ఎస్ 2020 నిధుల కింద మున్సిపాలిటీకి మంజూరైన రెండు కోట్ల నిధులను వార్డుకు ఇంత అంటూ ఫలహారంగా పంచొద్దని, వాటిని ప్రయోజనకరంగా మార్చాలంటూ మున్సిపల్ అధికారులపై కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన కమిషనర్ కృష్ణారెడ్డి మున్సిపల్ సమావేశం నిర్వహించారు.

కౌన్సిలర్లకు తెలియజేయాలి

వార్డుల్లో తమకు తెలియకుండా పనులు నిర్ణయించి, వాటికి ఆమోదం తెలపడానికి మాత్రం సంప్రదించడం భావ్యం కాదంటూ అధికారులపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో జరిగే పనులు తమకే తెలియలేదంటే ఈ పదవుల్లో ఉన్నది ఎందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైస్‌చైర్మన్ వెంకటరత్నం సమావేశం జరుగుతుండగానే వెళ్లిపోయారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి రూ.2 కోట్లు మంజూరయ్యాయని, అందులో చేపట్టే పనుల వివరాలు తెలుపుతూ అజెండాలో మాత్రమే ఉంచామన్నారు. దీనిపై కౌన్సిలర్ దయానిధి మాట్లాడుతూ రాసప్ప కాలనీలో కాలువ సమస్య పరిష్కరించాలని, అయితే అంత నిధులు మంజూరు చేయలేదన్నారు. కౌన్సిలర్‌తో సంప్రదించి ఉంటే ఇలాంటి విషయాలు తెలిపేవారమన్నారు. ఇంద్రయ్య, గోపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి మాట్లాడుతూ నిధులను ప్రసాదం పంచినట్లు 29 వార్డులకు పంచారని, అరకొర పనులు చేయవద్దన్నారు. దీంతో అజెండాలోని నిధుల కేటాయింపు అంశం వాయిదా పడింది. మిగిలిన అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

వైఎస్ఆర్ సీపీతోనే ఆలయాల అభివృద్ధి

- జీడీనెల్లూరు నియోజకవర్గంలో 180 ఆలయాలకు మహర్దశ







మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం, మాజీ డిప్యూటీ సీఎంకు సత్కారం



నిర్మాణంలో ఉన్న కనుగొండ రాయస్వామి ఆలయం

గంగాధరనెల్లూరు: గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో కోట్ల రూపాయలతో దేవాలయాలు అభివృద్ధి చేసిన ఘనత జగనన్నకే దక్కుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ధూప దీప నైవేద్యాల కింద ఆలయ అభివృద్ధి పనులు, అర్చక స్వాముల జీతభత్యాలను ఎంతో ఉన్నత స్థాయిలో పెట్టిన ఘనత సుస్థిర పరిపాలన అందించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని అన్నారు. జీడీ నెల్లూరు మండలంలోని పాపిరెడ్డి పల్లి పంచాయతీ పెద్ద కుంటపల్లి గ్రామంలో చిన్న కామసాని వంశస్తుల ఆరాధ్య దైవం కనుగొండరాయ స్వామి ఆలయ అభివృద్ధి పనులను శనివారం నాడు రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత వైఎస్ఆర్ సీపీ హయాంలో కోట్ల రూపాయలతో 180 ఆలయాల నిర్మాణానికి, అభివృద్ధి పనులకు కృషి చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా చిన్న కామసాని వంశస్తుల ఆరాధ్య దైవం కనుగొండ రాయస్వామి ఆలయానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో దాదాపు రూ.3.63 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. రూ.2.63 కోట్లు ఆలయ నిర్మాణానికి మ్యాచింగ్ గ్రాంట్ లేకుండానే అనుమతులు మంజూరు చేశారని తెలిపారు. ఆలయ గోపురం నిర్మాణానికి 10% మ్యాచింగ్ గ్రాంట్‌తో సీజీఎఫ్ నిధులు ద్వారా కోటి రూపాయలు మంజూరు చేసిన ఘనత జగనన్నకే సాధ్యమని అన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో ఇచ్చిన సీజీఎఫ్ నిధులను రద్దు చేయడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వం చివర్లో ఆలయ అనుబంధంగా ఉన్న కల్యాణ మండపాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించేందుకు ఐదు కోట్ల రూపాయల అంచనా వేసి ప్రారంభించామన్నారు. ప్రభుత్వం మారగానే అభివృద్ధి పనులు ఆగిపోవడంతో సేకరించిన నిధులు దాదాపు మూడు కోట్ల రూపాయలతో కల్యాణ మండపం నిర్మాణం జరుగుతోందని, శుక్రవారం నాడు కాంక్రీట్ మౌల్డింగ్ (పైకప్పు) కూడా వేస్తారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆలయ అభివృద్ధి పనులకు సహకరించడం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి ప్రత్యేక చొరవ చూపించి, ఆలయ నిర్మాణ పనులకు సహకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ నిర్వాహకులు చిన్నమరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కేఆర్ వెంకటరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, స్థానిక సర్పంచ్ పార్థసారథి రెడ్డి, ఎట్టేరి కృష్ణారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రూపకుమార్ రెడ్డి, లక్ష్మీకరరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు కిషోర్‌కుమార్ రెడ్డి, పాపిరెడ్డిపల్లి వెంకటేష్‌రెడ్డి, వాసుదేవ రెడ్డి, పెనుమూరు మండల పార్టీ అధ్యక్షుడు కామసాని విజయ్‌కుమార్ రెడ్డి, వెదురుకుప్పం మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రఘుపతి రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే సుగాలి ప్రీతికి న్యాయం



మీడియాతో మాట్లాడుతున్న కాళప్ప

శ్రీరంగరాజపురం: సుగాలి ప్రీతికి న్యాయం చేసింది జగనన్న ప్రభుత్వమేనని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సుగాలి ప్రీతి కేసుపై మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాళప్ప మండిపడ్డారు. ప్రీతి ఘటనలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రభుత్వంలో బాధిత కుటుంబానికి ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. అదే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 2021 సంవత్సరంలో సుగాలి మృతి కేసును సీబీఐకి అప్పగించారన్నారు. సుగాలి ప్రీతి తండ్రికి రెవెన్యూ శాఖలో ఉద్యోగం, కర్నూలు నడిబొడ్డున 5 సెంట్ల ఇంటి స్థలం, 5 ఎకరాల భూమిని వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. సాంస్కృతిక విభాగం మణి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవి, రవి, సిద్ధు, నాగరాజు పాల్గొన్నారు.